# తీతువు

'మనిషి అన్నాక జీవితంలో అనేక మలుపులు, కోరికలు,

ఆశయాలు... అతిశయాలు, అన్నీ సహజాతి సహజమై మానవ నైజాన్ని సజీవంగా ముందుకు నెడుతుంటే, వాటి తాలూకు రుగ్మతలు, మృగ్యమానవీయాలు నైజాల నైరాశ్యంలో మారు మనిషిని ఆవిష్కరింప జేస్తూనే ఉంటాయి.

ఏ మూల నుండి చూసినా ఆశువులాంటి ఆ పదాల పొత్తిళ్ళ లోని భావార్థం లోకనాథానికి సరిగ్గా అతికినట్లు సరిపోతుంది.

మనిషి తనాన్ని త్రోసిరాజని కొంచెం ముందుకు జరిగి అధికారపు చట్రాన్ని అంధకారం జేసి, ఒదిగిపోతూ.... ఒరిగిపోతూ... అస్థిత్వం కోసమై నిరంతరం అశ్రులు చాస్తూ విశృంఖలమై అసంబద్ధ అంశాలలోనూ ఆలంబనచెందుతూ......

లోకనాథం గురించి ఎంత చెప్పినా, ఎంత వ్రాసినా ఇంకా సశేషంగానే మిగులుతూ ఉంటుంది.

సరిగ్గా దరిశపత్రులో ఉన్న ప్రతి మనిషి మెదదులోను అదే భావన నిండిపోయి ఉంది. స్థాయిలు, పెద్దరికాలు ప్రక్కన పెడితే లోకనాథాన్ని అందరూ వేనోళ్ళ పొగుడుతూనే ఉన్నారు.

ఆ ఇంటి ముందు వందలు దాటి వేయికి పైన జనాలు కన్పిస్తున్నారు. అందరి మధ్యలోను లోకనాథం దండలతో మునిగిపోయి

ఉన్నాడు. పదేపదే దండలు పడుతూంటే కొన్నింటిని తీసి ప్రక్కన పెడుతున్నాడు దుష్యంతు.

'అంతంత పెద్దపెద్ద దండలు వేస్తున్నారు. అయ్యగారికి ఊపిరాడొద్దూ! బడుద్దాయి పెద్దగా అరిచాడు.

వాడొక్కడే అమాయక చక్రవర్తి. వయసుతో బాటు శరీరం పెరుగుతున్నా బుర్రపెరగని పిచ్చోడు.

'ఊపిరాగిపోయింతర్వాత ఊపిరాడటం ఏంటేహే!' బడుద్ధాయిని దబాయించ బోయాడు నకలయ్య. కానీ పెద్దోళ్ళ ఇళ్ళలో చావును కూడ పెళ్ళిగానే పరిగణిస్తారన్న విషయం గుర్తుకు వచ్చి నోట్లోనే సణుక్కున్నాడు.

ఒక్కొక్కరే వచ్చి తమ ప్రియతమ నాయకుడు, దరిశిపర్రు పట్టణానికి మకుటమున్న మారాజుగా వెలుగొందిన లోకనాధానికి నివాళులర్పించి వెళుతున్నారు.

అవును మరి! ప్రజల మనిషి లోకనాథం. నయాన్నైనా, భయాన్నైనా కాదన్న వాడిని దారికి తెచ్చుకొని బలవంతంగానైనా జేజేలు కొట్టించుకున్న లోకనాథం. అందుకే అచ్చంగా అయిదుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా ఆ పట్టణాన్ని ఏలగలిగాడు.

అసమ్మతి అనేది పుట్టకుండాజేసి ఒక వేళ పుట్టినా వెంటనే గిట్టేట్లు చేయగలిగిన వాడు కాబట్టే పాతిక సంవత్సరాలు అవిశ్రాంతంగా పాలించగలిగాడు ఇంతకాలంగా అస్మదీయులకు తలలో నాలుకలా, తస్మదీయులకు కంటిలో నలకలా వేధిస్తూ, మురిపిస్తూ తనలోని అధికార దాహాన్ని పదవీ తృష్ణను పదిలంగా తీర్చుకున్నాడు.

ఈ క్రమంలో ఆయనగారి చేతికి, చేతి వాటానికి అడ్డూ అదుపూ లేకపోయింది. సొంత ప్రయోజనానికి కొంత తిని మరి కొంతైనా గెలిపించి నోళ్ళకోసం ఖర్చు పెట్టాలన్న కనీస ఆలోచన నరనరాన జీర్ణించుకున్న మనిషి ఆయన.

పోయినోళ్లందరూ మంచోళ్ళు అన్నట్లు కనీసం చనిపోయింతర్వాత అందరినోళ్ళ లోను ఇప్పుడు నాలుగు మంచిమాటలే వినబడుతున్నాయి.

లోకనాధం కన్నుమూసి అప్పుడే మూడోరోజు. ఎందరో రాజకీయ నాయకులు తాము పదవుల్లో కొనసాగుతుండగానే తమ వారసుల్ని ప్రకటించి పట్టాభిషిక్తుల్ని చేసిన క్రమంలో రెండేళ్ళ క్రితమే కొడుకు దుష్యంతుకి మునిసిపాలిటీ చైర్మన్ గిరీని బంగారు పళ్లెంలో పెట్టి ఒప్పగించేశాడు. తర్వాత తన పేరుకు ముందు 'మాజీ'ని తగిలించుకుని శేషజీవితం గడిపాడు.

తన మునిసిపల్ కోటరీలో ఎందరో సీనియర్లు ఉన్నా, అందులో చాలా మందికి కనీసం కొంచెం సేపయినా ఆ సీటులో కూర్చోవాలని కలలు కన్నా అవన్నీ ఆయనగారి

పుత్రవాత్సల్యం ముందు బలాదూరే అయ్యాయి.

అలాగే తన కొడుకు కొడుకుని అమెరికాకు పంపించి పెద్ద కంప్యూటర్ ఇంజనీర్‌ని చేయాలని కలగన్న మరుక్షణమే డాలర్ల అరణ్యవాసానికి అమెరికా విమానం ఎక్కించేశాడు.

ఇప్పుడు మనవడు వ్యాసమూర్తి అమెరికాలో పెద్ద కంప్యూటర్ ప్రొఫెషనల్. ఈ రోజుల్లో అమెరికా వెళ్ళడం అనేది ఒక స్టేటస్ సింబల్‌గా నిలిచిపోతుంటే ఆ స్టేటస్‌ను తన మనవడి ద్వారా పొందగలిగాడు.

లోకనాథం గారి మరణ వార్త అన్ని పేపర్ల డిస్ట్రిక్ ఎడిషన్స్ ప్రముఖంగా ప్రచురించాయి. కొన్ని పత్రికలు మెయిన్ ఎడిషన్లలోను, సెంటర్ స్ప్రెడ్‌లోను ముద్రించేశాయి. ఆయన సేవాతత్పరత.... ఆయన జీవితంలో ముఖ్యఘట్టాలు, కుటుంబనేపథ్యం, కొడుకు దుష్యంతు, మనవడు వ్యాసమూర్తితో కలిపి దిగిన ఫోటోలు అన్నీ పుంఖాను పుంఖాలుగా ప్రచురితమవుతున్నాయి.

ఇక ఆయన చేత సహకారం పొందిన వాళ్లు, ఉద్యోగాలు సంపాదించుకున్న ఉద్యోగస్తులు, కాంట్రాక్టులు పొందిన బడా కాంట్రాక్టర్లు, పర్సంటేజీలు సమర్పించుకొని తమకు అనుకూల తీర్మానాలు చేయించుకున్న పెద్ద మనుషులు అందరూ ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ పెద్ద పెద్ద పేపరు ప్రకటనలు ఇస్తున్నారు.

అందుకే గొప్పోళ్ళ చావు కూడా పెళ్ళితో సమానమన్న నానుడి లోకనాథం విషయంలో మరొక్కసారి రుజువవుతోంది. ఆ ప్రాంతానికి చెందిన మంత్రిగారు వచ్చి ఘనంగా నివాళులర్పించి వెళ్లారు. ఆయనకి మీడియా వాళ్ళు మంచి కవరేజి ఇచ్చేశారు.

'వ్యాసమూర్తి బాబు అమెరికా నుండి విమానం పట్టుకు రావడానికి మరో రెండు రోజులు పట్టొచ్చు. అప్పటిదాకా పెద్దాయన ఐస్ డబ్బాలోనే నిద్రపోతాడు'

'చల్లని తండ్రి వెళ్లిపోయాడు. ఇక మా కాలనీకి మంచినీళ్ళ ట్యాంకర్లు పంపించేదెవరు. ఈ వేసవిలో గొంతు ఎండిపోతూంటే గొంతు నింపేదెవరు!' ఊరు చివరి కాలనీలోని ఒకామె రోడ్డుమీద పడి రోధిస్తోంది.

'అవును దాహార్తిని తీర్చడానికి తమ సొంత డబ్బువెచ్చించి ఊరులోని మారుమూల కాలనీకి నీటి సరఫరా చేయిస్తున్నాడు. బహుశా అంత కాలం ప్రజాభిమానం చూరగొనడానికి అదో ముఖ్యకారణంగా అనుకోవచ్చు.

'ఆరి అబ్బాయి దుష్యంతు ఉన్నాడుగా. ఆయనా నీళ్ళు తెచ్చి పోస్తున్నాడుగా!' మరొకామె కితాబునిచ్చింది.

'పిచ్చిమొగమా! అసలు ఈ ఊరికి అప్పట్లో నీటి ఎద్దడి ఎక్కడుంది. ఊరు

మధ్యలో మంచినీటి చెరువు క్రమేపి కుంచించుకుపోయింది. ఎండవేళల్లో తళతళా మెరిసే నీటి మెరుపులు కబ్జాలు చేయబడ్డాయి. అంతా అధికార మదంతో ఆక్రమించేశారు. చూస్తూండు ఊరికి నీటి ఎద్దడే కాదు, తిండి ఎద్దడీ వచ్చేస్తుంది.

'నీకో విషయం చెప్పేదా! లోకనాథం హయాంలోనే చెరువు కాస్తా హరించుకు పోయింది. నాబోటి ఒకరిద్దరు అప్పటి కౌన్సిలర్లు నిలేశాం కూడా....

'చెరువును మింగేశాం. ఇప్పుడు ట్యాంకర్‌లతో నీరు సప్లైచేస్తున్నందుకు ప్రజలు మనకు ఓట్లేస్తున్నారు. కానీ మంచి నీటి చెరువును పునరుద్ధరిస్తే వాళ్ళ అవసరాలు తీరుతాయి. అప్పుడు పిచ్చి జనాలకి మన అవసరం ఉండదు. వెంటనే మన తలరాతలు మారుతాయి' ఒకప్పుడు లోకనాథం అన్న మాటల్ని కౌన్సిలర్ మారయ్య ఉటంకిస్తున్నాడు.

పీడన ఉంటేనే ప్రజలకు రాజకీయ నాయకుల అవసరం ఉండేది. అప్పుడే మనం దండలు వేయించుకొనేది. ఇంత సంపాదించుకొని కార్లలో తిరగ్గలేది.

'హ ! చనిపోయిన మనిషి గురించి ఇప్పుడు మంచే మాట్లాడుకోవాలి!' మారయ్యను హెచ్చరిస్తూన్నాడు ప్రక్కనున్న అసామి.

మునిసిపాలిటీ అత్యవసరంగా ఛైర్మన్ దుష్యంతు అధ్యక్షతన సమావేశమైంది. లోకనాథం మృతికి సంతాపతీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

'మనిషికి ఎప్పటికైనా మరణం సహజమైంది. ఈదరిశిపట్రు పట్టణం తోటి నాకున్న అనుబంధం సుదీర్ఘమైంది. అందుకే నేను చనిపోయిన తర్వాత కూడా ఈ ఊరి నడిబొడ్డుతోనే మమేకమై ఉండాలని ఆశిస్తున్నాను. నేను ఈ ఊరి పురోభివృద్ధికి తీసుకున్న చొరవను పరిగణనలోనికి తీసుకొని నా భౌతిక కాయాన్ని ఊరి మధ్యలోని గడియారం స్థంభం ప్రక్కన ఉన్న ఎకరం స్థలంలో దహనం చేసి ఆ పవిత్రస్థలాన్ని నా జ్ఞాపకచిహ్నంగా అభివృద్ధి పరచాలని ఆదేశిస్తున్నాను!'

లోకనాథం గతంలో రాసిన విల్లు ప్రతిని సమావేశంలో ప్రవేశపెట్టారు. సభ్యుల అంగీకారం కూడా వెంటనే జరిగిపోయింది. వెంటనే ఆ స్థలాన్ని చదును చేయించటం ప్రారంభించారు. రాళ్లు రప్పలు తొలగిస్తున్నారు. మధ్యలో ఎత్తైన స్టేజీ నిర్మిస్తున్నారు. పనులన్నీ యుద్ధ ప్రాతిపదికమీద జరుగుతున్నాయి. మునిసిపాలిటీ తీసుకున్న నిర్ణయం పట్ల ఊరిలో హర్షం వ్యక్తమయింది.

'ఇక నుండి లోకనాథం గారు ఊరికి తోడుగా మనమధ్యనే ఉంటారు. అక్కడో మంచి పార్కును నిర్మిస్తే బాగుంటుంది !'

'పార్కు కూడా ఆయనకు తగిన స్థాయిలో ఉండాలి!!'

'మహానగరాలలో జాతీయస్థాయి మహానాయకుల సమాధులను నిర్మించి భావితరాలకు గుర్తుండిపోయేలా చేస్తున్నారు. అలాగే లోకనాథంగారు మన ఊరికి మహా నాయకుడు. ఆయన సమాధిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది నిత్యం స్మరించుకోవలసిన అవసరం ఎంతగానో ఉంది.

పిచ్చిమొక్కల్ని తొలగిస్తున్నారు. ఉన్న ఆక్రమణల అడ్డును తీసేస్తున్నారు. శ్రమదానం చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. షామియానాలు ఏర్పాటవుతున్నాయి. నేల మీద తివాచీలు పరుస్తున్నారు. అభిమానులు తీరిగ్గా తిలకించడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. మంత్రులు కూడా విచ్చేస్తున్నారన్న సమాచారం కూడా అందింది. వ్యాసమూర్తి రావడానికి మరికొన్ని గంటలు పట్టవచ్చు. ఆయనొచ్చి తాతగారిని కడసారి చూసుకున్న తర్వాతే తదుపరి కార్యక్రమం.

అక్కడ లోకనాథానికి అన్ని రకాల కైవల్య సేవలు వైభవంగా జరుగుతున్నాయి. ఎందరెందరో వచ్చి కడసారి దర్శనం చేసుకుంటున్నారు. పొరుగూర్ల నుండి ట్రాక్టర్ల మీద, ఆటోల మీద గుంపులు గుంపులుగా వచ్చి తమ నాయకుడి భౌతికకాయాన్ని చూసి పోతున్నారు. వచ్చిన అందరికి భోజనాలు అక్కడే ఏర్పాటు చేయడంతో కొందరైతే లోకనాథం మీద లేని ప్రేమను ఒలకబోస్తూ అక్కడే ఉండిపోతున్నారు.

'మొన్న జరిగిన ఎలక్షన్లో అవతల పార్టీవోడు క్వార్టరు బాటిలు రెండువందలు ఇస్తే మా అయ్య మటుకు ఫుల్‌బాటిలు ఐదువందలు బయటకు తీశాడు. అదీ దమ్మంటే!' గొప్పగా చెబుతున్నాడు పూర్తిగా పట్టించేసిన ఓ యువకుడు. ఎవరి కోణంలో వారు దివంగత లోకనాథాన్ని కొనియాడుతూనే ఉన్నారు.

అన్ని మతాలవారు వచ్చి వారి వారి ఆచారాల ప్రకారం ప్రార్థనలు చేస్తున్నారు. అప్పుడే లోకనాథం చనిపోయి నాలుగురోజులయింది.

దుష్యంతు తండ్రిని చూసుకొని కుమిలిపోతున్నాడు. ఆయన గారి ఫీలింగ్స్‌ని లోకల్ టీవీ వాళ్ళు బాగా ప్రొజెక్ట్ చేసి ప్రసారం చేస్తున్నారు.

'లోకనాథం గారికి మనవడంటే ఎంత ప్రేమో! అతగాడు వచ్చింతరువాత చేస్తేనే ఆయనగారి అత్మకు శాంతి...!'

'హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి నిన్ననే కారు వెళ్లింది. వచ్చే టైము అయింది.'

శవపేటికను పూలచెండులతో చక్కగా అమరుస్తున్నారు. హుందాగా పూలతో అలంకరింపబడిన వాహనం రెడీగా ఉంది. కర్మక్రతువుకోసం పురోహితుల్ని సిద్ధం చేశారు. బాణసంచా కూడా పెద్దఎత్తున తెచ్చిపెట్టారు. ఊరేగింపుకు ముందు బ్యాండుమేళం, సన్నాయి

ఏర్పాటు చేయబడింది. ఇక వ్యాసమూర్తి రావడమే తరువాయి.

'ఎలాగైనా లోకనాథం గారు చాలా అదృష్టవంతుడు. ఒక్క మాటలో చెప్పాలంటే చచ్చినా ఆయన బ్రతికున్న మనిషి' ఒకామె గద్గద స్వరంతో అంటోంది.

అందరూవచ్చి దుష్యంతుని అదే పనిగా ఓదారుస్తున్నారు. ఈ రోజుల్లో చాలా మందిలాగ ఆయనకు దుఃఖం ఏమీ పెల్లుబుకడం లేదు. కానీ వాళ్ళ ఓదార్పు మాటలు కొంచెం కొంచెం కరిగించి కళ్ళలో నీళ్లు తెప్పిస్తున్నాయి.

తాతగారి మృతదేహాన్ని చూసి గొల్లుమన్నాడు వ్యాసమూర్తి. తనకు అడుగులు నేర్పించిన తాత, తనను భుజాన వేసుకుని త్రిప్పుతూ పెంచి ఇంతవాణ్ణి చేసిన తాత ఇక లేడు అంటే తట్టుకోలేకపోతున్నాడు. చిన్న కుర్రాడిలాగ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. అతన్ని ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు.

ఈనాటి తన హోదా, సంపాదన అంతా అప్రస్తుతంగా అన్పిస్తున్నాయి.

'ఊరుకో బాబూ! నువ్వు అమెరికాలో పెద్ద ఉద్యోగంలో ఉన్నావు. ఆయన పోయాడని తెలియగానే అంతదూరం నుండి పరిగెత్తుకు వచ్చిపడ్డావు. అదృష్టవంతుడివి కాబట్టే ఆఖరి చూపు దక్కింది నీకు. చూడు ఆయనకి ఎంత వైభవంగా చేస్తున్నారో!'

'పెద్దయ్య గారు ఎప్పుడూ నిన్నే తలచుకొనే వారు. తన మనవడి గురించి నలుగురితో ఎంతో గొప్పగా చెప్పుకొని మురిసిపోయేవారు.'

'ఆయన టైమ్ అయిపోయింది. వెళ్లిపోయాడు. అసలు మరణం తర్వాత ఈ ఊరిలో ఇంత ఘనంగా మరొకరకి జరిగిందంటే నేను నమ్మను' లోకనాథం సమకాలీకుడైన మీసాల జోసెఫ్‌తో సహా అక్కడున్న అందరూ వ్యాసమూర్తిని ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు.

'మీ తాతగారి కోరిక మేరకు అంత్యక్రియలు గడియారం స్తంభం సెంటర్‌లో జరుగనున్నాయి. దానికి మునిసిపాలిటీ కూడా తీర్మానం చేసింది.

'వస్తే ఒక్క క్షణం ముందుగా ఏర్పాట్లను పరిశీలిద్దువు!'

మౌనంగా కూర్చున్న వ్యాసమూర్తి వారి వారి సానుభూతి మాటల్ని వింటూనే ఉన్నాడు. ఊరిమధ్యలో ప్రధమ సంస్కారం అంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

'ఏదీ! ఆ చెరువు గట్టుమీదా?!!

'చెరువేంటి బాబూ! అదెప్పుడో పూడిపోయింది. అయినా అదిప్పుడు మంచినీటి చెరువు కాదు.

వ్యాసమూర్తి ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. వారి ఏర్పాట్లలోను, వారికున్న స్వామి భక్తిలోను కొంత అసహజం అగుపిస్తోంది. తాతగారు ఆ ఊరికి ప్రీతిపాత్రమైన నాయకుడు కావచ్చు. దానిలో ఏ మాత్రం సందేహం లేదు. కానీ ప్రతి ఊరికి కొన్ని కట్టుబాట్లు, నిబంధనలు ఉంటాయి.

'ఊరిలో మధ్యలో.... పట్టణాన్ని మరుభూమిగా మారుస్తూ.....'

అంతమందిలో ఏమీ మాట్లాడలేకపోయాడు వ్యాసమూర్తి.

వాళ్లనుండి విడివడి అటువైపు వడివడిగా నడిచాడు. ఆ ప్రదేశం అంతా సందడిగా ఉంది. తన చిన్నప్పుడు అక్కడో మంచినీటి చెరువు ఉండేది. ఆ గట్లమీద చెట్ల మధ్యలో చల్లని సాయంత్రం వేళలు ఆడుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి వ్యాసమూర్తికి.

ఇప్పుడు ఆ చెరువు అదృశ్యమైపోయింది. ప్రస్తుతం అక్కడ ఒక ప్రముఖుని అంతిమ సంస్కారం కోసం అట్టహాసంగా ఏర్పాట్లు చేయబడి ఉన్నాయి. షామియానాలతో కళకళలాడుతోంది. నేలమీద ఆకుపచ్చని తివాచీలు పరిచారు. కొన్ని వందల కుర్చీల మధ్య పెద్ద ఎత్తయిన వేదిక. దాని మీద టన్నులకొద్దీ గంధపు చెక్కలు గుట్టలుగా ఉన్నాయి.

ఒక ప్రక్క ఊరివారికి ఆ నాయకుని మీద ఉన్న ప్రేమానారాగాలు ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. కానీ దానికి అతీతమైన ఓ సామాజిక ప్రయోజనం వ్యాసమూర్తిని హెచ్చరిస్తూనే ఉంది.

'ఊరిలో త్రాగునీటికి ఉన్న ఒక్క మంచినీటి చెరువు ఇది. ఇప్పుడు కనుమరుగయి పోయింది. మరి మీకు త్రాగునీరు ఎలా అందుతోంది!'

'దుష్యంతు బాబుగారు ట్యాంకర్ల ద్వారా రోజూ సరఫరా చేస్తున్నారు. ఇక మాకు కొదవేముంది బాబూ!'

'ఆ నీరు ఎక్కడ నుండి సరఫరా చేస్తున్నారు?'

'ప్రక్క ఊరి నుండి'

'అక్కడి చెరువూ ఇలా మరో నాయకుని స్మృతికోసం పూడ్చేస్తే తరువాత పరిస్థితి?'

'........'

'నీటి కబ్జాల్ని అరికట్టడంలో మీ అందరికి బాధ్యత లేదని భావిస్తున్నారా?'

'.....'

అక్కడి వారి మౌనం వెనుక ఓ ఆరాటం, ఓ నైతిక అలసత్వం వ్యాసమూర్తికి స్పష్టంగా అగుపిస్తున్నాయి.

'లేకేం బాబూ! ఇక్కడ కన్నీరు జల ధారగా పారుతోంది.'

'ఈ ఊరి మంచినీటి అవసరాలు తీర్చడానికి ఈ చెరువు ఒక్కటే సమాధానంగా ఉండేది. మొన్నటిదాకా దీనివల్లే ఊరు కొంత పచ్చదనాన్ని సంతరించుకోగల్గింది. కానీ ఇప్పుడు ఆ సమాధానం ముంగిట కొండంత ప్రశ్న.' మంగలిషాపు తాటి రాములు అనే ముసలాయిన అన్న మాటలు ఆలోచనలో పడేస్తున్నాయి.

'మరి ఇప్పుడు'

'పెద్దాయన రాసిపెట్టిపోయిం తర్వాత కాదనే ధైర్యం ఇక్కడ ఎవరికుంది. నీరు లేక మనుషులు మోడులుగా మారుతూంటే అది పాపమైనా, పుణ్యమైన దుష్యంతు బాబు గారే బాధ్యత వహిస్తారు.'

కుమ్మరి కోటయ్య మాటల్లోని నైరాశ్యం వ్యాసమూర్తిని కదిలిస్తోంది. అవును... తాతగారు ప్రజల మనిషి. దానికిముందుగా ఓ మనిషి. అందరిలోని కట్టుబాట్లు, సామాజిక బాధ్యతలను తానూ కలసి పంచుకోవలసిన మనిషి. ఆయన ఇష్టాలు కోరికలు, అవసరాలు ఆయనకు ఉండొచ్చు. తన వ్యక్తిగత స్వార్ధాన్ని ఊరుమ్మడి అంశానికి పీటముడి వేయడం క్షమించరాని విషయం.

అసలు ఊరు మొత్తాన్ని వల్లకాదు చేస్తూ, ఊరి మధ్యలో... అదీ ఇన్నివేల జనాభా కల్గిన పట్టణపు దాహార్తిని తీర్చగలిగిన ఏకైక మంచినీటి చెరువును పూడ్చిపడేసి....

రక్త సంబంధాన్ని మించిన ప్రజా అంశమేదో వ్యాసమూర్తిని మేలుకొలుపుతోంది. విద్య ఇచ్చిన వివేకం ఆధునిక భావాలను పుణికి పుచ్చుకున్న ఆ యువకుడిని కుదిపిపారేస్తోంది.

లోకనాథం పుట్టిన ప్రతి మనిషిలానే తానూ తనువు చాలించాడు. అప్పుడు అందరిలో తానూ ఒక్కడిగా మిగలాలి గానీ, మానవత్వం మరచి ఇలా విపరీతమైన కోరికలతో ఊరు స్వరూపాన్ని మార్చిపడేయడం....

అంతర్లీనమైన ఓ బాధ్యతా బంధమేదో వ్యాసమూర్తిని మనిషిగా నిలబెడుతూనే ఉంది.

'-------'

కొడుకు అన్న మాటలు రుచించడం లేదు దుష్యంతుకు.

'ఇది తాతగారి మనోగతం.... ఊరి ప్రజల కోరిక.... అంతా కలిసి చేసిన తీర్మానం.....'

'మరి నిండైన చెరువు'

'అది ఇప్పుడు లేదు. ఎప్పుడో పూడికలతో మాయమైపోయింది!'

'ఆక్రమించుకుంటూ పోతే ఏమీ మిగలదు.'

డాలర్ల కొడుకు మాటల తీక్షణత ముందు నోరు పెగలడం లేదు దుష్యంతుకు.

'మా కుటుంబం మీద, ముఖ్యంగా లోకనాధం తాతగారి మీద మీకున్న అపారమైన గౌరవ మర్యాదల్ని ఎప్పుడూ మేము గుండెల్లో భద్రపరచుకుంటాము. కానీ అవన్నీ ఈ ఊరి మనుగడకు ప్రతిబంధకం కారాదని నా విన్నపం... ఎంత ప్రజా నాయకుడైనా లోకనాధం గారు ముందు రక్తమాంసాలతో పుట్టిన మనిషి అన్న మాటను విస్మరింపరాదు. ఆయన ద్వారా ఊరిని అపప్రదజేయడం సహించరాని విషయం. అందుకే ఆయన అంతిమ సంస్కారం ఉత్తరాన ఉన్న స్వర్గవాటికలోనే జరుగుతుంది. మరణించిన నాయకుడి స్మృతి నిమిత్తం ఎకరం స్థలం చొప్పున కేటాయించుకుంటూ పోతే ఈ భూమి మీద ఒకనాటికి జీవించిఉన్న వారికి కనీసం నిలవడానికి కూడా స్థలం మిగలదని నా ఉద్దేశ్యం!'

కొడుకు మాటలకు అచేతనంగా మిగిలిపోవడం తప్ప ఏమీ అనలేకపోతున్నాడు దుష్యంతు.

'దయచేసి ఇది మా కుటుంబ నిర్ణయంగా భావించండి.'

'.........'

'బాధ్యతనెరిగిన ఈ ఊరి మనిషిగా కనుమరుగైన ఈ మంచినీటి చెరువును తిరిగి పునరద్దరింపదల్చుకున్నాను..... ఈ 'లోకనాధం మానస సరోవరం' ద్వారా ఊరి దప్పిక తీరి పచ్చదనంతో పరిమళించాలని కోరుచున్నాను.... అప్పుడు ఆయన నిజంగా మీ గుండెల్లో అంతర్లీనంగా వెలుగుతూనే ఉంటాడు... ఈ జలయజ్ఞం బాధ్యతను నా సొంత సొమ్ములతో నెరవేర్చదల్చుకున్నాను.'

ఇంతవరకు పైకి చెప్పలేక, గొంతు పెగలక లోలోపల మదన పడుతున్న అక్కడి వారి ఉద్దేశ్యాలు ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి.

లోకనాధం మానస సరోవరం వారి హృదయ చంద్రికలపై చిరుజల్లుల రవళిలా అన్పిస్తోంది. ఆ దిశగా ఊరు ఊరంతా కార్యోన్ముఖం అవుతోంది.

✿

**(విశాలాంధ్ర 'ఆదివారం అనుబంధం'లో ప్రచురితం)**